సాక్షి ఒడిశా

గురువారం । 27 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ.81,753

బంగారం: 120 మిల్లీ గ్రాములు

వెండి: 16 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



ముగిసిన బురదల పోలమ్మ ఉత్సవాలు

ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన గ్రామ దేవత బురదల పోలమ్మ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి.

- 8లో.

జూలై 6 నుంచి రాష్ట్రపతి పర్యటన



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూలై 6 నుంచి 9 వరకు నాలుగు రోజుల ఒడిశా పర్యటనకు రానున్నారు.

- 8లో.

రాష్ట్రంలో త్వరలో మద్య నిషేధం..!



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నిత్యానంద గోండ్

- ఆదాయం కోసం అమ్మకాలను ప్రోత్సహించలేం
- దశలవారీగా నిషేధించే అవకాశం
- మంత్రి నిత్యానంద గోండ్

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో మద్య నిషేధం అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒడిశాలో మద్య నిషేధం గురించి ఊహాగానాల మధ్య సామాజిక భద్రత, వికలాంగుల సాధికారత మంత్రి నిత్యానంద గోండ్ బుధవారం మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి నిషేధం తప్పనిసరి అన్నారు. రాష్ట్ర సామాజిక భద్రత, దివ్యాంగుల సాధికారత విభాగం మంత్రి నిత్యానంద గోండ్ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం రాష్ట్రాన్ని మద్యపాన రహితంగా మార్చడానికి దశలవారీగా విధానాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఆదాయం చేజారిపోతుందనే ఆలోచన కంటే మద్యం మరియు మాదకద్రవ్యాల వల్ల కలిగే సామాజిక సమస్యలను ఎదుర్కోవడమే ఈ చొరవ లక్ష్యంగా మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయంగా కలకలం రేపిన వాతావరణం మధ్య, కొత్తగా ఎన్నికైన బీజేపీ ప్రభుత్వం ఒడిశాను మద్యం రహితంగా మార్చాలని యోచిస్తోందన్నారు. పూర్తిగా కాకున్నా దశల వారీగా ఒడిశాను మద్యం రహితంగా మార్చాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం.

ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారం

ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15 నుంచి ఒడిశాలో మద్య నిషేధం అమలు చేయనున్నట్లు సోషల్ మీడియాలో ఇటీవల ప్రచారం నడిచింది. ఈ ప్రచారాన్ని తిరస్కరించిన కొద్ది రోజుల తర్వాత రాష్ట్ర సామాజిక భద్రత, దివ్యాంగుల సాధికారత మంత్రి నిత్యానంద గోండ్ రాష్ట్రంలో మద్యాన్ని నిషేధించే యోచనలో ప్రభుత్వం ఉందని బుధవారం పునరుద్ఘాటించారు. ఆదాయం పోతుందనే భయంతో మద్యం అమ్మకాలను ప్రోత్సహించలేమన్నారు. మద్యం వ్యసనం కారణంగా సమాజం కలుషితమవుతోందని, అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యసన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అన్నారు. ప్రభుత్వ స్థాయిలో పలు రాష్ట్రాల్లో మద్యాన్ని నిషేధించినట్లు గుర్తుచేశారు. బీహార్, గుజరాత్, మిజోరం మరియు నాగాలాండ్ రాష్ట్రాల్లో మద్యపానం నిషేధించబడిందన్నారు. తమ ప్రభుత్వం కూడా అదే పనికి కట్టుబడి ఉందన్నారు. ఈ విషయమై అబ్కారి, ఇతర శాఖలతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. దశలవారీగా ఒడిశాను మద్యం రహితంగా మార్చేందుకు ప్రయత్నిస్తామని నిత్యానంద గోండ్ పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు డ్రగ్స్ వినియోగాన్ని తగ్గించేందుకు రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు.

• మర్యాదపూర్వక భేటీ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అవిభక్త కొరాపుట్ జిల్లాల కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యేలు కలుసుకున్నారు. న్యూఢిల్లీలోని నూతన పార్లమెంట్ భవనానికి కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క దంపతులు బుధవారం వెళ్లారు. వారితో పాటు ఒడిశాకి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు వెళ్లారు. ఇదే సమయంలో రేవంత్ రెడ్డి కూడా పార్లమెంట్ భవనానికి చేరుకున్నారు. దీంతో పార్లమెంట్ వద్ద వీరందరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. రేవంత్‌ని కలిసినవారిలో ఎమ్మెల్యేలు రాంఖడం (పొట్టంగి), సత్యజిత్ గమాంగ్ (గుణుపూర్), సాగర్ దాస్ (భవానీపట్న), దశరథీ గమాంగ్ (మోహన), నీల మదవ హిక్క (బిసంకటక్), మంగు కిలో (చిత్రకొండ) ఉన్నారు. – కొరాపుట్

న్యూస్‌రీల్

పిడుగుపాటు మృతులకు ఎక్స్‌గ్రేషియా

భువనేశ్వర్: బర్‌గఢ్ జిల్లా పదంపూర్ మండలంలో పిడుగుపాటుకు గురై ముగ్గురు మృతి చెందడంపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన ముఖ్యమంత్రి, ఒక్కొక్కరికీ రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి ఉచితంగా సరైన వైద్యం అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు.

నకిలీ మావోయిస్టులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారి అంకిత వర్మ

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలో ఇద్దరు నకిలీ నక్సలైట్లను అరెస్టు చేసినట్లు జయపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారి అంకిత వర్మ బుధవారం వెల్లడించారు. అరెస్టైనవారు బొయిపరిగుడ సమితి మౌళి పంచాయతీ బిచల్‌కోట గ్రామానికి చెందిన లోకనాథ్ గొలారి కుమారుడు కెమ గొలారి, బిసింగపూర్ పోలీసుస్టేషన్ పరిధి రాణిగడ్ గ్రామానికి చెందిన ఖగపతి హరిజన్ కుమారుడు త్రిపతి హరిజన్‌లుగా పేర్కొన్నారు. వారి వద్ద నుంచి ఎర్రని సిరాతో వేయబడిన కమ్యూనిస్టు పార్టీ సుత్తి కొడవలి గుర్తులున్న రెండు పేపర్లు, టికాదార్‌తో ఉన్న మరో పేపరు, తిరుపతి హరిజన్ ఆధార్ కార్డు, ఒక కీప్యాడ్ సెల్‌ఫోన్, ఒక ఎయిర్‌టెల్ సిమ్ కార్డు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసినట్లు వెల్లడించారు. వీరిరువురు తాము నక్సలైట్లమని ప్రజలను భయపెడుతూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ ఏడాది మార్చి 9వ తేదీ సాయంత్రం జయపురం వీఐపీ లైన్‌కు చెందిన బృందావన సాహు కుమారుడు సంతోష్ కుమార్ సాహు, అలాగే ఏప్రిల్ 5వ తేదీన కంట్రాక్టర్ రాజేష్ కుమార్ జైన్ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు. వీరి వద్ద డబ్బులు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎట్టకేలకు వీరిని అరెస్టు చేసి కటకటాలకు తరలించినట్లు తెలియజేశారు.

నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడులు



సీజ్ చేసిన సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: సమితిలో నువాగుడ గ్రామ ప్రాంతంలోని అడవిలో నాటుసారా బట్టీలపై జయపురం ఎక్సైజ్ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. నువాగుడ అడవిలో నాటుసారా తయారు చేస్తున్న సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ సిబ్బంది దాడులు జరిపారు. అయితే అధికారులు వస్తున్నారని ముందుగానే పసిగట్టిన మద్యం మాఫియా వ్యక్తులు పరారయ్యారని ఎక్సైజ్ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర వెల్లడించారు. అడవిలో ఉన్న రెండు సారాబట్టీలను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఆ రెండు బట్టీల్లో 900 లీటర్ల సారా తయారు చేసేందుకు సిద్ధం చేసిన ఊట, 80 లీటర్ల నాటుసారాతో పాటు సారా నిల్వ చేసే డ్రమ్ములు, వంట సామగ్రి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సారా ఊట, నాటుసారాను పారవేసినట్లు వెల్లడించారు.

తేనెటీగల దాడిలో వృద్ధుడు మృతి



సుక్కు ప్రదాని మృతదేహం

కొరాపుట్: మనుమడిని రక్షించే ప్రయత్నంలో తాత మృతి చెందిన విషాదకర ఘటన బుధవారం చోటుచేసుకుంది. కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి బరంగబడి గ్రామానికి చెందిన సుక్కు ప్రదాని (55) తన మనుమడు చిన్ను ప్రదానితో కలిసి మేకలను మేపడానికి సమీప అడవికి వెళ్లాడు. ఇదే సమయంలో ఒక్కసారిగా తేనెటీగలు చిన్నుపై దాడి చేశాయి. దీంతో చిన్ను ప్రాణభయంతో కేకలు వేశాడు. ఇది చూసిన తాత తన శరీరం మీద ఉన్న వస్త్రాలు కప్పి చిన్నుని రక్షించాడు. ఇదే సమయంలో తేనెటీగలు తాత సుక్కు ప్రదానిపై దాడి చేశాయి. వాటి తీవ్రత ఎక్కువ అవ్వడంతో ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు. వెంటనే కుటుంబ సభ్యులు సుక్కుని సమీప వైద్యుడి వద్దకి తీసుకొని వెళ్లారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ సుక్కు మృతి చెందాడు. ఈ ఘటన స్థానికి ప్రజలను తీవ్రంగా కలచివేసింది.

జల దిగ్బంధంలో రాజధాని



వర్షపు నీటిలో చిక్కుకున్న బస్సులు

భువనేశ్వర్: బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో రాజధాని నగరం జల దిగ్బంధంలో చిక్కుకుంది. స్థానిక ఇస్కాన్ ఆలయం సమీపంలో నీరు నిలిచిపోవడంతో మూడు బస్సులు జల విలయంలో చిక్కుకున్నాయి. భువనేశ్వర్ మరియు కటక్ జంట నగరాలతో సహా రాష్ట్రంలో 6 జిల్లాలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. కంధమల్, కహహండి, నయాగడ్, ఖుర్దా (భువనేశ్వర్‌తో సహా), కటక్ (కటక్ నగరంతో సహా) మరియు నువాపడా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం, మెరుపులతో కూడిన ఉరుములు మరియు ఒకటి లేదా రెండు చోట్ల తీవ్రమైన వర్షం కురుస్తుంది. లోతట్టు ప్రాంతాల్లో నీటి దిగ్బంధం, అప్పుడప్పుడు దృశ్యమానత తక్కువగా ఉండటం మరియు పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని వాతావరణ సంస్థ హెచ్చరించింది.

జార్ఖండ్ దంపతులకు బాలిక దత్తత



బాలికను దత్తతగా స్వీకరిస్తున్న దంపతులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా పొష్య సంతాన కేంద్రం నుంచి 14 ఏళ్ల బాలికను జార్ఖండ్ దంపతులకు దత్తత నిమిత్తం జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ కార్యాలయంలో మంగళవారం అధికారికంగా అప్పగించారు. సంవత్సరం క్రితం ఈ దంపతులు పొష్య సంతాన దత్తత పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోగా, జూన్ 25న కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ అప్పగించారు. ఇప్పటివరకూ గజపతి జిల్లా నుంచి 55 శిశువులను అనేక దేశ, విదేశాల దంపతులకు అప్పగించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బీరేంద్ర కుమార్ దాస్, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి, జిల్లా శిశు సంక్షేమ సమితి అధ్యక్షుడు అశ్వినీ కుమార్ మహాపాత్రో, నిస్వాన్ సలోం కేంద్రం పర్యవేక్షకులు కుమార్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

డిఫ్తీరియాపై అధికారుల అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

జయపురం: కొరాపుట్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యాపిస్తున్న డిఫ్తీరియాపై జయపురం అధికారులు అప్రమత్తమయ్యారు. కొరాపుట్ జిల్లా నారాయణపట్నలో డిఫ్తీరియా వలన ఇద్దరు మరణించడం, పలువురు పీడించబడుతుండడంతో ఆ వ్యాధిని నివారించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. స్థానిక సాహిద్ లక్ష్మణ నాయిక్ స్మృతి భవనంలో జయపురం మున్సిపాలిటీ నిర్వహించిన డిఫ్తీరియా వ్యాధిపై జరిగిన చర్చా సమావేశంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణ కుమార్ పాఢీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన డిఫ్తీరియా వ్యాధి లక్షణాలు, దానివలన కలిగే నష్టాలు, వ్యాధి నివారణ, నియంత్రణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో డిఫ్తీరియా వ్యాధికిలోనై అనేకమంది ఆస్పత్రిలో చేరారని, నారాయణపట్నలో ఇద్దరు మరణించారని తెలిపారు. ఈ వ్యాధి నివారణకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు కలుషిత నీరు తాగకుండా ప్రజలను అప్రమత్తులను చేయాలని పిలుపునిచ్చారు. వ్యాధి సోకినట్లు అనుమానం వస్తే సకాలంలో తగు చికిత్స చేయించుకోవాలని, లేకపోతే మరణాలు సంభవించవచ్చని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ సిద్ధార్థ నాయిక్, డాక్టర్ సురేష్ చంద్ర పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

నదీ జలాలు విషపూరితం



నదుల్లో తేలియాడుతున్న మృత చేపలు

- భారీగా చేపల మృత్యువాత

భువనేశ్వర్:

పూరీ జిల్లా కొణాస్ మండలంలో ప్రవహించే ప్రధాన నది దయా, దాని ఉపనదులు రజువా, మకర నదీ జలాలు విషపూరితమయ్యాయి. ఈ నదుల్లో మత్స్య సంపద ప్రాణహానితో నీటిపై లెక్కకు మిక్కిలిగా తేలియాడుతున్నాయి. ఈ నదీ జలాలను వినియోగించుకునే నదీతీర గ్రామాల ప్రజలు తరచూ వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పుడు పెంపుడు జంతువులు కూడా నదీజలాలు తాగడం వల్ల రకరకాల వ్యాధుల బారినపడుతున్నాయి. ఈ పరిస్థితులు దయా నది పరివాహక ప్రాంతంలో తీవ్ర అనారోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాజధాని నగరం భువనేశ్వర్ నుంచి తరలిస్తున్న విషపూరిత మురుగు నీరు, చెత్త దయా తీర ప్రాంతంలో భయానక అనారోగ్య పరిస్థితులను ప్రేరేపిస్తోంది. గంగువా కాలువ ద్వారా దయా నదిలోకి భువనేశ్వర్ ప్రాంతపు మురుగు నీరు వదులుతున్నారు. ఇది దయా మరియు దాని ఉపనదులైన రజువా, మకర నదిలోకి ప్రవేశించి సమగ్ర పరీవాహక ప్రాంతాలను విషపూరితం చేసింది. దీంతో నదుల్లోని నీటి వినియోగం నిరుపయోగంగా మారింది. గొడొబొడొపుట్, పాండియాకెర, చుపురింగి, సున్నాఖొలా, బొడాల్, గోపీనాథ్‌పూర్, సాహస్‌పూర్, గొడిసగొదా ప్రాంతాలకు దయా, రజువా, మకర నదుల నుంచి తాగునీటి శాఖ ఈ విషపు నీటిని పైపుల ద్వారా ప్రజలకు ఇంటి అవసరాలకు సరఫరా చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయమై దయా సురక్షా మంచ్ గంగువా కాలువ ద్వారా విషపూరిత మురుగు నీటిని దయా నదిలోకి విడుదల చేయవద్దని అనుబంధ అధికార వర్గాలకు చేస్తున్న అభ్యర్థనలను పెడ చెవిన పెడుతుందని అశోక్ ప్రధాన్, సుకాంత్ కిషోర్ సామంతరాయ్, శ్రీకాంత్ పట్టజోషి విచారం వ్యక్తం చేశారు. దీంతో స్థానికంగా రోజురోజుకూ ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది.

డిజిటల్ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న వినయ్ ద్వివేది

రాయగడ: సదరు సమితి జేకేపూర్‌లోని జేకే పేపర్ మిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లక్ష్మీపత్ సింఘానియా ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులు ప్రారంభమయ్యాయి. జేకే పేపర్ మిల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ వినయ్ ద్వివేది ముఖ్య అతిథిగా హాజరై బుధవారం తరగతులను లాంఛనంగా ప్రారంభించారు. ఆధునిక విద్య, సాంకేతికతను అవలంభించడంలో యాజమాన్యం చొరవ తీసుకుని ఈ తరగతులను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల కో-ఆర్డినేటర్ సందీప్ పాపండే, పీఆర్వో హరిహర ఖమారి, ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్ కర్ తదితరులు పాల్గొన్నారు.

'విలేకరిపై కుక్కలతో దాడి అమానుషం'



ఏడీఎం మాఝికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

రాయగడ: ప్రముఖ ఒడియా టీవీ ఛానల్‌లో పని చేసే మహిళా విలేకరిపై మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి రఘునందన్ దాస్ తన పెంపుడు కుక్కలతో దాడి చేయించడంపై విలేకరుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు జిల్లా పాత్రికేయుల సంఘాలకు చెందిన ప్రతినిధులు బుధవారం ఉదయం ఈ దుశ్చర్యకు నిరసన తెలుపుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ పేరిట వినతి పత్రాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు అందజేశారు. జర్నలిస్టులపై ఇటువంటి తరహా దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఒక మహిళ విలేకరిపై ఇటువంటి తరహా దాడులకు పాల్పడడం విచారకరమన్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మీడియా కేర్ చైర్మన్ డాక్టర్ బాదల్ కుమార్ ఝా, ప్రెస్‌క్లబ్ సాధారణ కార్యదర్శి రంజన్ కుమార్ రౌథొ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయం ఎదుట విలేకరులు

సర్పంచ్‌పై 'నిరక్షరాస్యత వేటు'

- ఒడియా చదవడం, రాయడం రాకపోవడంతో చర్యలు



కుంతల మల్లిక్

భువనేశ్వర్: ఒక మహిళా సర్పంచ్ పదవిపై నిరక్షరాస్యత వేటు పడింది. ఒడిశా రాష్ట్రంలో సర్పంచ్ పదవీ బాధ్యతల నిర్వహణకు స్థానిక (ఒడియా) భాష చదవడం, రాయడం రావాలి. అయితే ఈ అర్హతలు కలిగి ఉన్నట్లు నమ్మించి పంచాయతీ ఎన్నికల్లో ఒక మహిళ సర్పంచ్‌గా విజయం సాధించింది. క్రమేపీ ఆమెకు సర్పంచ్ పదవికి ఉండాల్సిన మౌలిక అక్షరాస్యత లేనట్లు తేలింది. దీంతో ఆమె పదవి ఊడింది. ఈ ఘటన భద్రక్ జిల్లా ధామ్‌నగర్ మండలం బయాంగ్‌డిహి పంచాయతీలో చోటుచేసుకుంది. కుంతల మల్లిక్ గత పంచాయతీ ఎన్నికల్లో తన ప్రత్యర్థి అభ్యర్థి భారతి బెహెరాను ఓడించి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆమె విజయం తర్వాత ఓడిపోయిన అభ్యర్థి భారతి బెహెరా ఆమె విజయానికి అనర్హులుగా సవాలు చేసింది. ఆమె ఎన్నిక రద్దు చేయాలనే అభ్యర్థనతో ధామ్‌నగర్ స్థానిక న్యాయ స్థానాన్ని ఆశ్రయించింది. సర్పంచ్‌గా విజయం సాధించిన కుంతల మల్లిక్ నిరక్షరాస్యురాలుగా పేర్కొని న్యాయ పోరాటానికి నడుం బిగించింది. దీంతో విచారణలో కుంతల మల్లిక్ నిరక్షరాస్యురాలిగా తేలింది. కేసు పూర్వాపరాల విచారణ ముగించిన న్యాయస్థానం సర్పంచ్ పదవిని రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

హైకోర్టులో సైతం చుక్కెదురు

దిగువ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ కుంతల మల్లిక్ రాష్ట్ర హైకోర్టుని ఆశ్రయించింది. అక్కడ కూడా ఆమె ఒడియాలో అక్షరాస్యతను నిరూపించుకోవడంలో విఫలం కావడంతో చుక్కెదురైంది. ఈ దశలో న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయాలని భద్రక్ సబ్ కలెక్టర్ మనోజ్ పాత్రో స్థానిక పంచాయతీ అధికారులకు లేఖ రాశారు. సబ్ కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం నాయబ్ సర్పంచ్ ప్రదీప్ కుమార్ బారిక్ బయాంగ్‌డిహి పంచాయతీ సర్పంచ్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. పంచాయితీ అధికారి (పీఈవో) ప్రదీప్ కుమార్ బారిక్‌తో ప్రమాణం చేయించారు. అయినా కుంతల మల్లిక్ సర్పంచ్ పదవిని వీడేది లేదని మొండి వైఖరి ప్రదర్శించారు. దీంతో ధామ్‌నగర్ మండల అభివృద్ధి అధికారి (బీడీఓ) సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమె నివాసం ముందు నోటీసును అతికించి, నిబంధనల మేరకు పదవి నుంచి వైదొలగాల్సిందేనని ఆదేశించి సర్పంచ్ బాధ్యతను ప్రదీప్ కుమార్ బారిక్‌కు అప్పగించారు. ఈ పరిస్థితిపై పదవి నుంచి వైదొలగిన కుంతల మల్లిక్ స్పందించేందుకు నిరాకరించారు. కొత్త సర్పంచ్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన ప్రదీప్ కుమార్ బారిక్ మాట్లాడుతూ మాజీ సర్పంచ్ అక్షరాస్యతను రుజువు చేసుకోవడంలో విఫలమైందన్నారు. దీంతో సర్పంచ్ పదవికి అనర్హురాలుగా నిర్ధారించారని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ లేఖను అనుసరించి తాను సర్పంచ్‌గా బాధ్యతను చేపట్టినట్లు వివరించారు.

క్లుప్తంగా

6 జిల్లాలకు ఎల్లో అలెర్ట్

భువనేశ్వర్: భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రాష్ట్రంలో 6 జిల్లాలకు పసుపు హెచ్చరిక జారీ చేసింది. బొలంగీర్, బర్‌గఢ్, మల్కన్‌గిరి, జాజ్‌పూర్, సుందర్‌గఢ్, గజపతిలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశంతో పసుపు హెచ్చరికను ఐఎండీ జారీ చేసింది. ప్రజలు వాతావరణంపై నిఘా ఉంచాలని, పిడుగుపాటు నుంచి తమను తాము రక్షించుకోవడానికి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచన జారీ చేశారు.

పిడుగులు పడి 5 మంది మృతి

బర్‌గఢ్, బొలంగీర్ జిల్లాల్లో బుధవారం జరిగిన వేర్వేరు పిడుగుల ఘటనల్లో 5 మంది వ్యక్తులు మృతి చెందారు. మరో 3 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రాథమిక సమాచారం ప్రకారం బొలంగీర్‌లో పిడుగుపాటుకు ఒక కుటుంబంలోని ఇద్దరు వ్యక్తులు మరణించగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బర్‌గడ్‌లో 3 మంది మృతి చెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బొలంగీర్ జిల్లా ఖప్రఖోల్ ప్రాంతం చొలాబంజీ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం పిడుగుపాటుకు ఒక మహిళ, ఆమె కుమారుడు మరణించారు. ఈ కుటుంబానికి చెందిన మరో సభ్యుడు తీవ్రంగా గాయపడ్డారు. బర్‌గఢ్ జిల్లాలో ఇదే విధమైన సంఘటనలో పదంపూర్ ప్రాంతంలో పిడుగుపాటు కారణంగా ముగ్గురు వ్యక్తులు మరణించారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను సుఖదేవ్ బనాచోల్, నిరోజ్ కుంభార్, ధనుజ్ నాయక్‌లుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

నగిరికటకంలో భారీ చోరీ

- 20 తులాల బంగారం, రూ.50 వేలు నగదు అపహరణ



తెరిచి ఉన్న బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

జలుమూరు: మండలంలోని నగిరికటకం గ్రామంలో రేజేటి శ్రీనివాసరావు ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపెద్ద కుమారుడు ఫణిబాబు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. అతనికి అనారోగ్యంగా ఉందన్న సమాచారం మేరకు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు ఈ నెల 21న హైదరాబాద్ వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం 11 గంటలకు నగిరికటకంలోని ఇంటికి వచ్చి చూసేసరికి ఉత్తరం వైపు తలుపులు తీసి ఉండడం గమనించారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. బీరువా తాళాలు పగలుకొట్టి సుమారు 20 తులాల బంగార ఆభరణాలు, రూ.50 వేల నగదును దుండగులు అపహరించుకుపోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ మధుసూదనరావు, శ్రీకాకుళం క్లూస్ టీమ్ ఎస్‌ఐ భరత్ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


36 కేజీల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయితో జీఆర్‌పీ పోలీసులు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో బుధవారం అక్రమంగా తరలిస్తున్న 39 కేజీల గంజాయిని జీఆర్‌పీ పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు రెండు కేజీల చొప్పున 19 ప్యాకెట్లతో గంజాయిని తరలించేందుకు కొందరు సిద్ధమయ్యారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి మహారాష్ట్రకు చెందిన జుబీర్ నజీర్ సయ్యద్, శ్యామ్‌లకు పట్టుకున్నారు. అరెస్టు చేసి కేసు నమోదు చేసి విశాఖపట్నం రైల్వేకోర్టుకు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. విశాఖ లైన్స్ సీఐ కె.వెంకటరావు, ఓపీ ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు, పలాస జీఆర్‌పీ ఎస్‌ఐ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



లక్ష్మిని పరామర్శిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు పద్మనాభపురం వద్ద ఓ భవననిర్మాణ కార్మికురాలికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. వంకల లక్ష్మి అనే కార్మికురాలు కాంక్రీటు మిల్లర్‌కు చీర తగిలి యంత్రం లోపలకు వెళ్లిపోయే క్రమంలో ఇతర కార్మికులు సకాలంలో స్పందించి కాపాడారు. అప్పటికే గాయాలు కావడంతో ప్రభుత్వ కిడ్నీ ఆసుపత్రిలోని అత్యవసర విభాగానికి తరలించి వైద్యసేవలు అందించారు. బాధితురాలిని రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ సవర రాంబాబు, నాయకులు సూర్యనారాయణరావు పరామర్శించారు.

ముగిసిన బురదల పోలమ్మ ఉత్సవాలు



పాల జంగిడిలో అమ్మవారి పాదాలను యథా స్థానానికి తీసుకెళ్తున్న పూజారి



కళాకారుల ప్రదర్శనలు



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎంపీ నెక్కంటి, ఆయన కుటుంబ సభ్యులు



నిప్పులపై నడుస్తున్న పూజారి

రాయగడ: ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన గ్రామ దేవత బురదల పోలమ్మ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. అత్యంత వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఈ ఉత్సవాల్లో చివరి ఘట్టాలు అంజలి రథం, మల్లెలు తొక్కడం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలు సందర్భంగా అమ్మవారి ప్రతి రూపాలైన ఘటాలను ఎండ్ల బండి చక్రానికి ఒక కర్రకు ఏర్పాటు చేసి దానిపై ఉంచి తిప్పుతారు. దీనినే అంజలి రథంగా పిలుస్తారు. ఇదిలాఉండగా చివరి ఘట్టం మల్లెలు తొక్కడం. దీనిలో భాగంగా ఎర్రటి నిప్పులపై పూజారి ఘటాలను మోసుకుంటూ నడుస్తారు. అనంతరం మంత్రపఠనంతో పాటు చిన్న కోడిపిల్లను పూజించి అగ్గిలో విడిచిపెడతారు. అంతటి నిప్పుల్లో కూడా కోడిపిల్లకు ఏమీ కాకుండా నిప్పులపై నడుచుకుంటూ వెళుతుంది. ఇది అమ్మవారి నిదర్శనానికి ప్రతీకగా ఇక్కడి ప్రజలు నమ్ముతారు.



ప్రసాదం వితరణ చేస్తున్న మహిళా క్లబ్ సభ్యులు



ఘటాలను తీసుకెళ్తున్న పూజారమ్మ

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం

ఇదిలా ఉండగా బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ముందుగా మజ్జిగౌరి అమ్మవారి ఘటాన్ని మేళతాళాలతో తీసుకెళ్లి అమ్మవారి మందిరం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో గ్రామదేవత మిగతా ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు సందర్భంగా ఇంటిలో పూజించే అమ్మవారి ఘటాలు (వీటినే ప్రతి ఘటాలు అంటారు) బురదల పోలమ్మ అమ్మవారి మందిరానికి తీసుకెళ్లి నిమజ్జనం చేయడంతో ఉత్సవాలు ముగిశాయి. అమ్మవారిని రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, అతని కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఆయనకు కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. ఉత్సవాలు ముంగింపు సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా స్వచ్ఛంద సేవా సంస్థలు, క్లబ్‌లకు చెందిన మహిళలు, మెయిన్ రోడ్డు ప్రాంతంలో మజ్జిగ, ప్రసాదం, తాగునీరు తదితరమైనవి పంపిణీ చేశారు.



అంజలి రథంపై ఘటాల తిప్పడం



బురదల పోలమ్మ మందిరం వద్ద భక్తుల సందడి

జూలై 6 నుంచి రాష్ట్రపతి పర్యటన

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జులై 6 నుంచి 9 వరకు నాలుగు రోజుల ఒడిశా పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో కమిషనరేట్ పోలీసులు ఆమె సందర్శించే ప్రాంగణాలు, వేదికల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయడానికి బ్లూప్రింట్‌ను సిద్ధం చేశారు. జులై 6, 8, 9 తేదీల్లో భువనేశ్వర్‌లో జరగనున్న రాష్ట్రపతి కార్యక్రమాలకు తగిన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసు కమిషనర్ సంజీబ్ పండా బుధవారం మీడియాకు తెలిపారు. జూలై 7న రథయాత్ర కోసం ఆమె పూరీని సందర్శించనున్నారు. భద్రతా ఏర్పాట్ల కోసం అనుబంధ అధికారులతో వివరణాత్మక సంప్రదింపులు ప్రారంభించారు. బహిరంగ సభలు షెడ్యూల్ చేయబడిన ప్రాంతాలను విశ్లేషణ ప్రారంభించారు. రాష్ట్రపతి పర్యటన రూట్ ప్లాన్‌పై కూడా దృష్టి పెడుతున్నామని సంజీబ్ పండా మీడియాకు తెలిపారు. రాష్ట్రపతి పర్యటన రథయాత్రలో ఉన్నందున కమిషనరేట్ పోలీసులు భద్రతా ఏర్పాట్లు పెను సవాలుగా నిలుస్తాయన్నారు. రూట్ లైనింగ్ మరియు శానిటైజేషన్ ఒక సవాలుగా ఉంటుంది. అయితే రాష్ట్రపతి భద్రతే మాకు ముఖ్యం కాబట్టి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తుగా సన్నాహాలు ప్రారంభించామని తెలిపారు. భారత రాష్ట్రపతి ఒడిశా పర్యటన తాత్కాలిక కార్యక్రమం సమాచారం ప్రకారం జులై 6న స్థానిక జయదేవ్ భవన్‌లో బహిరంగ సభ కార్యక్రమంలో పాల్గొంటారు. ఖండగిరి, ఉదయగిరిని సందర్శిస్తారు. జులై 8న ఒంధారువాలో జరిగే బ్రహ్మకుమారీల కార్యక్రమానికి హాజరవుతారు. జులై 9న జాతీయ విజ్ఞాన విద్య మరియు పరిశోధన సంస్థ నైజర్‌లో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు.

రథయాత్ర సజావుగా నిర్వహిస్తాం

- న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్



సమన్వయ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: యాత్రికుల పట్టణం పూరీలో శ్రీజగన్నాథుని రథయాత్ర సజావుగా నిర్వహించేందుకు ఒడిశా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ బుధవారం తెలిపారు. వార్షిక రథ యాత్ర పురస్కరించుకుని పూరీ టౌను హాలులో బుధవారం నిర్వహించిన ద్వితీయ సమన్వయ సమావేశానికి అధ్యక్షత వహించిన న్యాయమంత్రి తోబుట్టువులతో శ్రీజగన్నాథుని రథయాత్రను సజావుగా నిర్వహించేందుకు అవసరమైతే కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. శ్రీజగన్నాథ ఆలయ పాలకవర్గం (ఎస్‌జేటీఏ) జూలై 7న జరిగే రథయాత్రకు సంబంధించిన విధివిధానాల కార్యక్రమాలను ఇప్పటికే ఖరారు చేసింది. నిర్ధారిత వేళ ప్రకారం రథాలు లాగడం జరుగుతుంది. ఉత్సవాలను క్రమశిక్షణతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అన్ని ఆచారాలు, సేవల నిర్ధారిత వేళల ప్రకారం జరిగేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. బలభద్రుడు, దేవీ సుభద్ర మరియు శ్రీ జగన్నాథుని మూడు రథాల తయారీ సకాలంలో సిద్ధం అవుతాయి. కలప కొరత తలెత్తే ప్రసక్తే లేదన్నారు. తగినంత పరిమాణంలో కలప అందుబాటులో ఉందన్నారు. అవసరమైతే మరింత కలపను సేకరిస్తామని తెలియజేశారు. పూరీని అంతర్జాతీయ యాత్రికుల కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోందన్నారు. యాత్రికుల పట్టణం పూరీ చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురైందని మంత్రి విచారం వ్యక్తం చేశారు. పూరీని మళ్లీ ప్రపంచ యాత్రికుల కేంద్రంగా మార్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మందిర రత్న భాండాగారం తెరవడంపై అతి త్వరలో నిర్ణయం తీసుకుంటామని, ఒకటి రెండు రోజుల్లో ప్రజలకు తెలియజేస్తామని ప్రకటించారు.

సమస్య పరిష్కారానికి చర్యలు



పనుల ప్రారంభానికి పూజలు చేస్తున్న దృశ్యం

కొరాపుట్: దశాబ్ద కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి తొలి అడుగు పడింది. బుధవారం నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి తెలుగు ప్రజలు ఎక్కువగా నివసించే 12వ నంబర్ వార్డులోని చైనా మార్కెట్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడి ప్రజలు తాము వర్షాకాలంలో ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. కొందరు వ్యక్తులు పట్టణ మదర్ డ్రైన్‌ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వలన భారీ వర్షాలు కురిసినప్పుడు నీరు వెళ్లడానికి మార్గం లేకుండా పోతోందని పేర్కొన్నారు. అందువలన వర్షపు నీరు ఇళ్లలోకి వస్తోందని వాపోయారు. దీంతో ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. వెను వెంటనే జేసీబీ తెప్పించి ఆక్రమణల తొలగింపు పనులకు ప్రారంభ పూజలు చేశారు. ఆక్రమణల తొలగింపు పనులు ప్రారంభించారు. ఈ పరిణామం ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది.

పెండింగ్ కేసులపై దృష్టి

సరుబుజ్జిలి: సమాజంలో డ్రగ్స్, గంజాయి వినియోగం అరికట్టే దిశగా సిబ్బంది పనిచేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశించారు. సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి, ఆమదాలవలస సీఐ దివాకర్ వాయునందన్, ఎస్సై నిహార్, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లభద్ర రైల్వేగేటుకు కిలోమీటరు దూరంలో రైలు నుంచి ఓ యువకుడు జారిపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. బుధవారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో అతి వేగంగా వచ్చిన షాలిమార్ సూపర్‌ఫాస్ట్ రైలు ఒంపు తిరిగే క్రమంలో అసోం రాష్ట్రానికి చెందిన ఇంద్ర బహదూర్ బోరో ఒక్కసారిగా జారిపడి వరద కాలువలో పడిపోయాడు. బాధిత యువకుడిని గుర్తించిన గ్యాంగ్‌మాన్, ఇతర ప్రయాణికులు పలాస రైల్వేస్టేషన్‌కు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి 108 అంబులెన్సు చేరుకుంది. 108 ఈఎంటీ బత్తిని తారకేష్, పైలట్ కెల్లి శ్రీనివాసరావు, ఆర్‌పీఎఫ్ పోలీసు, గ్యాంగ్‌మాన్‌లు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం కిలోమీటరుకు పైగా బాధితుడిని మోసుకుని వచ్చారు. అనంతరం పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడి పరిస్థితి విషమంగా ఉందని సమాచార.



పట్టాల పక్కన బాధిత యువకుడు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పర్లాకిమిడి: మాట్లాడుతున్న ఎస్పీ స్వాతి కుమార్



పర్లాకిమిడి: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ పిలుపునిచ్చారు. స్థానిక సాంస్కృతిక భవనంలో జిల్లా పోలీసు, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యసనం ఒక ప్రాణాంతక వ్యాధి అని, వ్యసనపరులు దీర్ఘకాలం పాటు దానికి బానిసై తమ ఉనికిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలను సేవించడం వల్ల శారీరకంగా, మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతుండడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు చరణ్ పాత్రో, జిల్లా సామాజిక భద్రత అధికారి సింహాంచల్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: ప్రమాణం చేస్తున్న ఉద్యోగులు



రాయగడ: వేదికపై కలెక్టర్ మహాజన్, ఏఎస్పీ పాత్రో తదితరులు

మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలు

కొరాపుట్: ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వి.కీర్తివాసన్ అన్నారు. జిల్లా కేంద్రంలో మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. అలాగే నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో జిల్లా అధికార యంత్రాగం మాదక ద్రవ్యాల వినియోగంకి వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర, ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, ఏడీఎం మహేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి ఒక అవగాహన ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్ ప్రారంభించారు. పట్టణంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. జిల్లా యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం కాన్ఫరెన్స్ హాలులో మాదకద్రవ్యాల సేవన వల్ల కలిగే దుష్పరిమాణాలపై జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, జిల్లా అటవీ అధికారి సుబ్రహ్మణ్యం ఆనంద్, ఎస్పీ స్వాతి కుమార్ వివరించారు. కార్యక్రమంలో సీడీఎంవో డాక్టర్ మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



కొరాపుట్: ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తివాసన్



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

క్లుప్తంగా

రేణుకకు ప్రశంసలు

విజయనగరం ఫూల్‌బాగ్: ఈనెల 21 నుంచి 23వరకు తమిళనాడులోని సేలంలో జరిగిన మూడవ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన మొకర రేణుక శ్రీకరిణి ఉత్తమ ప్రతిభ కనబరిచి జూనియర్ బాలికలు అండర్ -58 విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. ఈ సందర్భంగా జిల్లా అటవీఅధికారి ఎస్ వెంకటేష్, ఎఫ్ఆర్ఓ బి. అప్పలరాజు, డీఆర్ఓ కేవీఎస్ రాజు బుధవారం ఫూల్‌బాగ్‌లోని జిల్లా అటవీశాఖాకార్యాలయంలో ఆమెను అభినందించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎత్తునుంచి జారిపడి పెయింటర్ మృతి

బాడంగి: మండలంలోని గజరాయునివలసలో ఎత్తయిన ఇంటికి రంగులు వేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయిన ఓ పెయింటర్ మృతిచెందాడు. బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మెరకముడిదాం మండలంలోని చినమంత్రిపేట గ్రామానికి చెందిన రేగుల మహేష్(38) గజరాయునివలసకు చెందిన నల్ల శ్రీరామ్‌రెండస్తుల డాబా ఇంటికి రంగులు వేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు, ఈ నేపథ్యంలో రోజూ మాదిరిగానే బుధవారం కూడా రంగులువేస్తుండగా జరిగిన ప్రమాదంలో కిందపడిపోగా తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. తాడుతో వేలదీసిన బల్లపై నిల్చుని రంగులు వేస్తుండగా తాడు తెగిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు చెప్పారు. మృతుని బంధువుల ఫిర్యాదుమేరకు ఎస్సై ఆర్.జయంతి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ఆస్పత్రిలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని..

రామభద్రపురం: మండలకేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. బుధవారం జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇంటికి పనికొచ్చే సామగ్రి విక్రయించే ఉత్తరప్రదేశ్‌కు చెందిన చిరువ్యాపారి సాజిద్ తన ద్విచక్ర వాహనంపై బూశాయవలస నుంచి రామభద్రపురం వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో సాజిద్ రోడ్డుమీద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. ఎస్సై జ్ఞాన ప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

చాలీచాలని భోజనాలపై విచారణ

- నిర్వాహకులకు నోటీసులు
- డిప్యూటీ ఈఓ మోహనరావు

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం చాలీచాలని భోజనాలు వడ్డించడంపై ఇన్‌చార్జి డిప్యూటీ ఈఓ కె.మోహనరావు బుధవారం విచారణ జరిపారు. 'చాలీచాలని భోజనాలు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తపై అధికారులు స్పందించారు. గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో భోజన నిర్వాహకులతో మాట్లాడారు. వంట చేస్తుండగా మధ్యలో గ్యాస్ అయిపోయినందున కొంతమంది పిల్లలకే భోజనాలు వంట పూర్తయిందని, మళ్లీ వంట చేసి మిగిలిన వారికి వడ్డించామని నిర్వాహకులు తెలిపారు. కొన్ని గుడ్లు పాడయిపోయాయని, అందువల్ల తక్కువగా వచ్చాయని చెప్పుకొచ్చారు. 250 మంది విద్యార్థులకు అసరమైనంత సరుకులు భోజన నిర్వాహకులకు అందజేశామని హెచ్‌ఎం మధుసూదనరావు వివరణ ఇచ్చారు. ఎప్పుడూ ఇలా జరగలేదని, ఇక ముందు జరగదని హెచ్‌ఎం, నిర్వాహకులు లిఖితపూర్వకంగా తెలియజేశారు. అనంతరం డిప్యూటీఈఓ భోజనాలను రుచి చూశారు. ఇక నుంచి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు సర్దిచెప్పారు. నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తానని చెప్పారు. ప్రతిరోజు ఎంఈఓలు పాఠశాలలను తనిఖీలు చేస్తున్నారని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డిగ్రీ అడ్మిషన్లపై సందిగ్ధం

- కొత్త ప్రభుత్వం నుంచి రాని కబురు
- ఎలాంటి ప్రకటన చేయని ఉన్నత విద్యామండలి
- అయోమయంలో డిగ్రీ కళాశాలల యాజమాన్యం
- ఇతర కోర్సులవైపు విద్యార్థుల మొగ్గు
- అడ్మిషన్ల కోసం 2,500మంది ఎదురు చూపు



పార్వతీపురంటౌన్: కొత్తగా యూజీ (డిగ్రీ) కోర్సుల్లో చేరబోయే విద్యార్థులకు అప్పుడే కష్టాలు మొదలయ్యాయి. విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఇప్పటి వరకూ డిగ్రీ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయక పోవడంతో ఇంటర్‌మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ విద్య వైపు దృష్టి సారించాల్సి వస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 12న ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడ్డాయి. ఫలితాలు వెలువడి దాదాపు 73 రోజులు కావస్తున్నా..నేటికీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలపై స్పష్టత లేకుండా ఉంది. ఈ నెల 18న ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ ఫలితాలు వెలువడడంతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరూ ఉన్నత విద్యావకాశాలపై దృష్టి సారించారు. ఏటా ఇంటర్‌మీడియట్ ఫలితాలు వెలువడిన అనంతరం డిగ్రీలో ప్రవేశాలకు విధివిధానాలను ఉన్నత విద్యామండలి రూపొందించి, నోటిఫికేషన్ జారీ చేస్తుంది. దీని ప్రకారం ఆయా కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతూ వచ్చాయి. గత ఏడాది సైతం జూన్ 20న అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. సకాలంలో అడ్మిషన్లు చేపట్టినప్పుడే అరకొరగా విద్యార్థులు కళాశాలల్లో చేరుతున్నారని, ఇక ఆలస్యంగా అయితే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందనే ఆందోళన కళాశాలల యాజమాన్యాల నుంచి వ్యక్తమవుతోంది.

చొరవ చూపని ప్రభుత్వం..

డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లపై నూతన ప్రభుత్వం చొరవ చూపడం లేదనే భావన కళాశాలల యాజమాన్యాల నుంచి వ్యక్తమవుతోంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం కనిపిస్తోంది. ఏపీ మంత్రుల పోర్ట్‌ఫోలియోలో ప్రత్యేకంగా విద్యాశాఖ అని పేర్కొనక పోవడంతో ఈ శాఖ ఎవరికీ కేటాయించలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రభుత్వం ప్రత్యేకంగా మానవ వనరుల అభివృద్ధి శాఖగా పేర్కొంటూ ఇందులో పాఠశాల విద్యాశాఖ, ఉన్నత విద్య, అక్షరాస్యత పెంపు లాంటి అంశాలను చేరుస్తూ మంత్రిగా నారా లోకేష్‌కు బాధ్యతలను సీఎం చంద్రబాబు కేటాయించారు. ఈ క్రమంలో ఉన్నత విద్యామండలి అధికారులతో చర్చలు జరిపి డిగ్రీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసే దిశగా నారా లోకేష్ ఇప్పటివరకూ చొరవ చూపకపోవడంతో సర్వత్రా గందరగోళం నెల కొంది.

పార్వతీపురం మన్యం జిల్లాలో డిగ్రీ కళాశాలల వివరాలు	
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	6
ప్రవేటు డిగ్రీ కళాశాలలు	10
ప్రస్తుత విద్యార్థులు	6500
ప్రథమ సంవత్సరంలో చేరనున్న విద్యార్థులు	2500

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మక సంస్కరణలు

గతంలో కరోనా వల్ల గాడి తప్పిన విద్యా వ్యవస్థను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలతో చక్కబెట్టింది. తనకిచ్చిన శాఖల పట్ల నారా లోకేష్ పూర్తిస్థాయి అవగాహనకు వచ్చిన తరువాత అధికారులతో చర్చలు జరిపి చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తుండడంతో డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్‌లో చేపట్టాలా? లేక ఆన్‌లైన్ ద్వారానా? అనే అంశం తేల్చుకోలేక ఉన్నత విద్యామండలి సందిగ్ధంలో పడింది.

ప్రత్యామ్నాయం వైపు విద్యార్థులు..

డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ జారీలో జరుగుతున్న జాప్యం కారణంగా విద్యాసంవత్సరం కోల్పోవడం ఇష్టం లేని విద్యార్థులు ప్రత్యామ్నాయ కోర్సుల వైపు దృష్టి సారిస్తున్నారు. దీనికి తోడు కళాశాలల యాజమాన్యాలు సైతం నోటిఫికేషన్ ఇప్పట్లో రాదనే భావనతో విద్యార్థులను భయపెడుతున్నాయి. దీంతో పలు ప్రైవేట్ విద్యాసంస్థలు పలు రకాల కోర్సులతో విద్యార్థులకు గాలం వేస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో

ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు

గతంలో డిగ్రీలో ప్రవేశాలకు ఆఫ్‌లైన్ ద్వారా అడ్మిషన్లను చేపట్టేవారు. దీంతో పట్టణ ప్రాంతాల్లోని కళాశాలలకు డిమాండ్‌కు ఎక్కువగా ఉండేది. పట్టణ ప్రాంతాలకు దూరంగా ఉండే కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య అరకొరగా ఉండేది. దీంతో వెనుకబడిన విద్యార్థులు చాలా నష్టపోయేవారు. ఈ సమస్య నుంచి విద్యార్థులకు ఊరట దక్కేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ అడ్మిషన్లకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆధునిక వసతులున్న కళాశాలలను ఎంపిక చేసుకునే వెసులుబాటు విద్యార్థులకు కల్పిస్తూ 2021 నుంచి ఆన్‌లైన్ అడ్మిషన్లను అప్పటి ప్రభుత్వం చేపట్టింది. విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపులు చేయడంతో ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు ఉన్న కళాశాలల్లో చాలా సులువుగా సీట్లు దక్కాయి. అంతేకాక జగనన్న విద్యా దీవెనను సమర్థంగా అమలు చేయడంతో ఉన్నత విద్యఓ వెలుగు వెలిగింది.

జేఎన్‌టీయూ జీవీ వీసీని తొలగించాలి

- అవినీతి అక్రమాలపై న్యాయ విచారణ
- ఉత్తరాంధ్ర విద్యార్థి సేన డిమాండ్



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకర రమణమూర్తి, వీసీ బాధిత చిరుద్యోగులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో జరుగుతున్న అవనీతి అక్రమాలపై న్యాయ విచారణ జరపాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన డిమాండ్ చేసింది. ఈ మేరకు కారణంలేకుండా విధుల్లోనుంచి తొలగించిన పలువురు చిరుద్యోగులతో కలిసి స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకర రమణమూర్తి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమాలకు కారకులైన వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్యను తక్షణమే విధుల్లోంచి తొలగించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. గతంలో విద్యార్థులు రోడ్డెక్కి డిమాండ్ చేసిన సమస్యలను ఇంతవరకు పరిష్కరించలేదని, సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసిన విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వాళ్ల ఇంటర్నల్స్, ఎక్సటర్నల్, ల్యాబ్ పరీక్షల్లో ఫెయిల్ చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని ఆరోపించారు. ఆయన రాకముందు నియామకాలు జరిగిన అవుట్ సోర్సింగ్ సిబ్బందిని కారణం లేకుండా 5 నెలల జీతాల బకాయి ఉంచి తొలగించి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. రూ.20 కోట్ల నిధులతో ప్రస్తుతం యూనివర్సిటీలో నిర్మిస్తున్న పరిపాలన భవన నిర్మాణంలో అక్రమాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.

క్వాలిటీ కంట్రోల్ లేకుండా బిల్లులు

కనీస నాణ్యత ప్రమాణాలు లేకుండా జరుగుతున్న నిర్మాణ పనులపై క్వాలిటీ కంట్రోల్ చెక్ చేయకుండా బిల్లులు చెల్లిస్తున్నారని మండిపడ్డారు. అగ్రిమెంట్ ప్రకారం నిర్మాణ పనులు చేయకుండా ఇప్పటికే రూ.7 కోట్లు వరకు వైస్ చాన్స్‌లర్ బిల్లులు చేయడం ఘోరం. ప్రభుత్వ నియమాల ప్రకారం రూ.1 లక్ష దాటిన ప్రతి ఐటమ్‌ను ఈ-ప్రొక్యూర్మెంట్ ద్వారా కొనాల్సి ఉంది. అయితే నిబంధనలను తుంగలో తొక్కి 'కాంపెక్స్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్' అనే ఓపెల్ కంపెనీతో ఎంఓయూ చేసుకుని యూనివర్సిటీ నిధులను వీసీ దుర్వినియోగం చేస్తున్నారు. ఈ అవినీతి అక్రమాలపై న్యాయ విచారణ జరపాలని కోరారు. వీసీ వేధింపులు తట్టుకోలేక ఓ మహిళా అధ్యాపకురాలు జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన ఘటన కూడా ఉందని గుర్తు చేశారు. సమావేశంలో విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు విసినగిరి నాగరాజు (విజయనగరం), ముల్లు మహేష్ (శ్రీకాకుళం), కంటుమల్లెడ్డి సూర్యనారాయణ (విశాఖ), వీసీ బాధిత చిరుద్యోగులు రవీంద్రకుమార్ సింగ్, శనపతి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంఖ్య ఎందుకు తగ్గింది?



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో పురుషుల కంటే మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, విద్యార్థుల్లో బాలికల నిష్పత్తి ఎందుకు తగ్గుతోందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రశ్నించారు. దీనిపై అధ్యయనం చేసి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్య, అనుబంధ సంక్షేమ వసతి గృహాలపై తన చాంబర్లో బుధవారం సమీక్షించారు. జిల్లాలో 98 శాతం ప్రవేశాలు పూర్తయ్యాయని, విద్యార్థుల్లో లక్షా20 వేల మంది బాలురు, లక్షా12 వేల మంది బాలికలు ఉన్నారని డీఈఓ ప్రేమకుమార్ తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, మహిళల జనాభా ఎక్కువ ఉన్నపుడు విద్యార్థినుల సంఖ్య ఎందుకు తగ్గుతోందని ప్రశ్నించారు. ఈ నెలాఖరు నాటికీ శతశాతం ప్రవేశాలు పూర్తి కావాలని స్పష్టం చేశారు. మధ్యాహ్నం భోజన పథకం అమలుపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థుల సంఖ్యపై నిగ్గు తేల్చాలని, ఎంఈఓలు తనిఖీ చేసి ఫొటో తీసి పంపించాలని ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులను ప్రశ్నించారు.

ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం పెరగాలి

ఇంటర్మీడియట్ విద్యపై సమీక్షిస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉండడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విద్యాసంవత్సరంలో కనీసం 80 శాతం ఉత్తీర్ణత లేకపోతే, ప్రిన్సిపాల్స్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని ప్రతి ప్రైవేటు కళాశాలను తనిఖీ చేసి, తనకు నెలలోజుల్లో నివేదిక అందించాలని ఆర్ఐఓను ఆదేశించారు. ఆయా కళాశాల్లో మౌలిక వసతులు, బోధనా పద్ధతులు, పిల్లలపై యాజమాన్యం పెడుతున్న ఒత్తిడిని పరిశీలించి నివేదించాలని సూచించారు. వయోజన విద్యాశాఖ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలపై సమీక్షించారు.

విస్తృతంగా క్షేత్ర పర్యటనలు చేయాలి

ప్రతి అధికారి విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. వారంలో సోమవారం తప్ప, మిగిలిన ఐదు రోజులూ పర్యటనలు తప్పనిసరన్నారు. ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించాలని, మధ్యాహ్నం నుంచి మాత్రమే సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి కె.సందీప్‌కుమార్, డీఈఓ ఎన్.ప్రేమకుమార్, ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ, డీవీఈఓ భీమశంకరరావు, వయోజన విద్య శాఖాధికారి సోమేశ్వరరావు, సాంఘిక సంక్షేమ అధికారి రాంగోపాల్, గురుకుల సంక్షేమ పాఠశాల జిల్లా కన్వీనర్ పి.పద్మజ, ఎంజేపీబీసీ స్కూళ్ల జిల్లా కన్వీనర్ సీహెచ్ రమామోహన్ పాల్గొన్నారు.

ఈజీమనీ కోసం మోసపూరిత యాప్‌లో మునిగి

- రూ.67లక్షలు పోగొట్టుకున్న ఇద్దరు బొబ్బిలి వాసులు

బొబ్బిలి:

ఈజీమనీ వస్తుందని నమ్మిన ఇద్దరు బొబ్బిలి వాసులు రూ.67లక్షలు పోగొట్టుకున్న ఘటన ఇది. దీనిపై సీఐ ఎం.నాగేశ్వర రావు విలేకరులకు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎల్ఐసీ డీఓ పి.కృష్ణారావు ఈ మోస పూరిత యాప్ బారిన పడి రూ.51,33,000లు పోగొట్టుకున్నారు. ఆయన గోల్డ్‌మెన్ స్కాచెస్ వీఐపీ పార్టనర్ గ్రూప్‌లో చేరి ట్రేడింగ్ చేస్తున్నారు. ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకూ ట్రేడ్ చేశారు. ఆ సమయంలో యాప్ నిర్వాహకులు స్టాక్ మార్కెట్‌పై అవగాహన కల్పించినట్లు నటిస్తూ పెట్టుబడి పెట్టి డబ్బులు ఎలా వస్తాయో నమ్మబలికారు. ఈ క్రమంలోనే రూ.51.33,000ల పెట్టుబడి పెడితే రూ.83లక్షలకు పైచిలుకు డబ్బు మీ అకౌంట్లోకి వస్తుందని సదరు యాప్ నిర్వాహకులు కృష్ణారావును నమ్మించారు. ఆయన ఆలోచించకుండా ఆ మొత్తాన్ని పూర్తిగా వారు చెప్పినట్లుగానే తనకు చెందిన ఐదు బ్యాంకు అకౌంట్ల ద్వారా జమ చేశారు. కానీ డబ్బులు మాత్రం అతనికి తిరిగి జమ కాలేదు. దీంతో కృష్ణారావు మోసపోయినట్లు గ్రహించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విశేషమేమంటే ఇప్పటికీ సదరు యాప్ నిర్వాహకులు మరో 1,73,000 రూపాయలు జమ చేస్తే మీ అకౌంట్లోకి రూ.83,41,618లు వస్తాయని చెబుతుండడం గమనార్హం. ఇదిలా ఉండగా మండలంలోని పక్కి గ్రామానికి చెందిన సివిల్ ఇంజినీర్‌గా ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న జి.భార్గవ్ యూఎస్ బ్యాంకు బిజినెస్ స్కూల్ వీఐపీ గ్రూప్ అనే మరో యాప్‌లో చేరారు. రూ.16లక్షలు పోగొట్టుకున్నారు. దీంతో ఆయన కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరారు.



అనుమానాస్పద లింకుల జోలికి వెళ్లకండి

సులువుగా ఎక్కువ డబ్బులు వస్తాయని నమ్మించే అనుమానాస్పద గ్రూపులు, లింకులు, యాప్‌ల జోలికి వెళ్లి మోసపోవద్దని సీఐ ఎం నాగేశ్వరరావు ప్రజలకు హితవు పలికారు. ట్రేడింగ్ అని, బెట్టింగ్ అని, లోన్ యాప్‌లనీ రకరకాల మోసాలబారిన పడి డబ్బును, మనశ్శాంతిని పోగొట్టుకోవద్దని సూచించారు. తాము ఎప్పటి నుంచో దీనిపై అప్రమత్తం చేస్తున్నా తెలివైన వారే మోసపోతున్నారని అసహనం వెలిబుచ్చారు. రెండేళ్ల క్రితం పట్టణానికి చెందిన ఓ మహిళ రూ.లక్ష పోగొట్టుకుంటున్న క్రమంలో చివరి నిమిషంలో డబ్బు ట్రాన్స్‌ఫర్ కాకుండా అడ్డుకోగలిగామన్నారు.

29న జాబ్‌మేళా

విజయనగరం రూరల్: విశాఖపట్నంలోని టెక్ మహీంద్రాలో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన సంస్థ అధికారిణి డి.అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఇంగ్లీష్ కమ్యూనికేషన్‌లో ప్రావీణ్యం ఉండి బీపీవో రంగంలో స్థిరపడాలనుకునే డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఎంపికైన వారు వైజాగ్ టెక్ మహీంద్రాలోనే ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. 328 ఖాళీలను భర్తీ చేయనున్నారని, వార్షిక వేతనం రూ.1.67 లక్షల నుంచి రూ.2.5 లక్షల మధ్య ఉంటుందన్నారు. ప్రాథమిక అంచనా, టెక్నికల్ రౌండ్, హెచ్ఆర్ రౌండ్ దశల్లో ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వారి పేర్లను సంబంధిత వెబ్‌సైట్‌లో ఈ నెల 28లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ 8919179415 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విజయనగరం-విజయవాడకు రెండు సూపర్ లగ్జరీ సర్వీసులు



జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం అర్బన్: విజయనగరం డిపో నుంచి విజయవాడకు రాకపోకల కోసం రెండు సూపర్‌లగ్జరీ సర్వీసులను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు బుధవారం ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక డిపో గ్యారేజీ దగ్గర జెండా ఊపి ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ మాట్లాడుతూ విజయనగరం నుంచి విజయవాడ రాకపోకలకు ప్రయాణికులకు అందుబాటులో రవాణా సేవలను అందించడానికి సూపర్ లగ్జరీలను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఆదినారాయణ, బస్టాండ్ స్టేషన్ మేనేజర్ పి.సత్యనారాయణ, వివిధ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం

- ప్రతిజ్ఞచేయించిన ఎస్పీ ఎం.దీపిక
- నగరంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



సీఎంఆర్ కూడలి వద్ద విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్:

ప్రతి ఒక్కరూ మాదక ద్రవాలకు దూరం కావాలని ఎస్పీ ఎం.దీపిక పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ శాఖ యువత, విద్యార్థుతో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సీఎంఆర్ జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించింది. ర్యాలీని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. మత్తు పదార్థాల విక్రయం, రవాణా చేసేవారి సమాచారాన్ని డయల్ 100 లేదా టాస్క్ ఫోర్స్ సీఐ సెల్: 91211 09416కు సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి అక్రమ రవాణా కేసులో ఒకసారి అరెస్టు అయితే జీవితనం నాశనమైనట్టేనన్నారు. చెడు సహవాసాలు, వ్యసనాలకు బానిసై లక్ష్యానికి దూరం కావద్దని యువతకు హితవుపలికారు. మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో వన్‌టౌన్, టూటౌన్, ఆర్మ్‌డ్ ఫోర్స్, విద్యార్థులతో పాటు విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, టూటౌన్ సీఐ కె.రామారావు, ఎస్‌బీ సీఐ కేకేవీ విజయనాథ్, సీసీఎస్ సీఐ సత్యనారాయణ, ఆర్ఐలు గోపాలనాయుడు, ఆర్.రమేష్‌కుమార్, భగవాన్, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు, సైకాలజిస్ట్ డాక్టర్ హిమబిందు, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, అధిక సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్

కౌలురైతుల గుర్తింపు పక్రియ..

నత్తనడక

పంట సాగుహక్కు ధ్రువీకరణ పత్రం ... కౌలు రైతులకు అతి విలువైనది. ఈ ప్రతం ఉంటే ఎరువులు, విత్తనాలు రాయితీపై లభిస్తాయి. బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి. విపత్తుల సమయంలో పంట నష్టపరిహారం అందుతుంది. ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి భరోసాకు ఈ కార్డే ఆధారం. ఇంతటి ప్రాధాన్యమున్న కార్డుల జారీలో ప్రభుత్వ నిర్లక్ష్యం కౌలు రైతులను ఆందోళన, ఆవేదనకు గురిచేస్తోంది.

- ఖరీఫ్ సీజన్ ఆరంభమైనా నగం మందికి కూడా గుర్తింపు కార్డులు అందించని వైనం
- 2024-25 సీసీఆర్‌సీ కార్డుల జారీ లక్ష్యం 15,550
- ఈ ఏడాది ఇంతవరకు ఇచ్చినది కేవలం 15
- 2023-24 సంవత్సరంలో 12,816 మందికి గుర్తింపు కార్డుల మంజూరు



పొలం దున్నుతున్న రైతు

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో కౌలు రైతుల గుర్తింపు పక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ ఏడాది కౌలు రైతులకు అందించే సాగుహక్కు ధ్రువీకరణ పత్రాలు (సీసీఆర్‌సీ) అందుతాయో లేదోనన్న బెంగ రైతులను వెంటాడుతోంది. సీసీఆర్‌సీ కార్డులు లేకపోతే అందాల్సిన ప్రయోజనాలు అందవని కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు అన్నివిధాలా మేలు జరిగింది. వారికి సీసీఆర్‌సీ కార్డులు అందజేయడంతో పాటు విత్తనాలు, ఎరువులను కూడా అందించింది. అంతే కాకుండా సాధారణ రైతులకు ఇచ్చిన విధంగా వారికి వైఎస్సార్ రైతు భరోసా పథకం ఆర్థిక సాయాన్ని అందించింది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వ హయాంలో కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీ పక్రియ మందకొడిగా సాగుతోంది. గత ప్రభుత్వం జిల్లాలోని 12,816 మంది కౌలురైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందజేసింది. ఈ ఏడాది 15,550 మందికి కార్డులు అందజేయాలని కొత్త ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే, ఇంతవరకు కేవలం 15 మందికి మాత్రమే సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు(సీసీఆర్‌సీ) కార్డులు అందాయి. 15,535 కార్డులు అందించాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. రైతులు కొన్ని చోట్ల పంటల సాగుకు ఉపక్రమించగా, మరికొన్ని చోట్ల పొలాలను సిద్ధం చేస్తున్నారు. కార్డుల జారీలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. అసలు అందుతాయా? లేదా? అన్న సందేహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటివరకు పెట్టుబడి భరోసా నిధులు కూడా విడుదల చేయకపోవడంతో రైతన్నకు కష్టాలు తప్పేలా లేవని వాపోతున్నారు.

వేగవంతం చేస్తాం

పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాల జారీ లక్ష్యం 15,550. ఇంతవరకు 15 మందికి సీసీఆర్‌సీ కార్డులు ఇచ్చాం. ప్రస్తుతం విత్తనాల పంపిణీ జరుగుతోంది. వచ్చేనెల మొదటి వారం తర్వాత సీసీఆర్‌సీ కార్డుల జారీ పక్రియ వేగవంతం అవుతుంది. ఈ లోగా భూయాజమానులు కౌలుకు ఇచ్చిన భూమిని గతంలో ఇచ్చిన వారికే ఇచ్చారా? లేదంటే వారే సాగుచేస్తున్నారా? అనేది తెలుస్తుంది.

– అన్నపూర్ణ, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి